క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్ : కడప పాలిటెక్నిక్(గవర్నమెంట్, ప్రైవేటు)లో ఇంటర్ వృత్తి విద్యా కోర్సు, డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోగా సంబంధిత పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు సమర్పించాలని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సిహెచ్.జ్యోతి తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్‌ను 19న కడప ప్రభుత మహిళా పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ సెట్లు, రెండు పాసుపోర్టు సైజు పొటోలు తీసుకురావాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు సీటు వచ్చిన వారు గవర్నమెంట్ కళాశాలకు రూ.4700, ప్రైవేటు కళాశాలకు రూ.25 వేల రుసుము కట్టాల్సి ఉంటుందన్నారు.

ఐక్యత పెంపొందించడమే లక్ష్యం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఉపాధ్యాయలలో ఐక్యత పెంపొందించడమే లక్ష్యంగా పని చేస్తామని బీటీయూఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సంఘం బ్రోచర్‌ను డీఈఓ షేక్‌షంషుద్దీన్ ఆ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులంతా రిలీవర్లు లేక పాత పాఠశాలలోనే పనిచేస్తున్నారని తెలిపారు. పీఎస్ హెచ్‌ఎంలు, బదిలీ అయిన ఉపాధ్యాయులకు త్వరగా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌టీపీ జిల్లా అధ్యక్షుడు రామ కృష్ణంరాజు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇలియాష్‌బాషా పాల్గొన్నారు.

18న కడప కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాలనే డిమాండ్‌తో జూలై 18న కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు డీఎస్సీ–2003 ఉపాధ్యాయల ఫోరం జిల్లా కన్వీనర్లు గుజ్జల తిరుపాల్, వీర ప్రతాప్, ప్రవీణ్ కిరణ్ కోరారు. కడప వన్‌టౌన్ సీఐ అమర్‌నాథ్‌రెడ్డిని మంగళవారం వారు కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నాకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని డీఎస్సీ–2003 ఉపాధ్యాయులంతా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు. గంగాధర్, అయ్యావారురెడ్డి, దేవానంద్, వసంత్, బాబురెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ విద్యా సంస్థలను బలోపేతం చేయండి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉర్దూ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని, అంగన్వాడీల స్థాపన నుంచి విశ్వ విద్యాలయం స్థాయి వరకూ కార్యాచరణ ప్రకటించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ హుస్సేన్ ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మెగా డీఎస్సీలో ఉన్నతీకరించిన పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులు చూపించలేదని, దీంతో విద్యాభ్యాసం కష్టతరంగా మారిందన్నారు. ఉపాధ్యాయ ఖాళీ స్థానాలలో అర్హులైన ఉర్దూ మీడియం విద్యా వాలంటీర్లను నియమించాలని వారు కోరారు. అన్ని జిల్లాల్లో 520 ఇంగ్లీష్, తెలుగు మీడియం పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉర్దూ మొదటి భాషగా చదివేలా చూడాలని, ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు. ఎనిమిదేళ్లు పూర్తి కావస్తున్నా శాశ్వత ప్రాతిపదికన ఒక్క ఆచార్య పోస్ట్ మంజూరు చేయలేదన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఆచార్యుల పోస్టులు మంజూరుచేసి ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేయాలని వారు కోరారు.

ఐక్యతతో మెలగాలి

కడప కోటిరెడ్డి సర్కిల్/పులివెందుల : సేవకులంతా ఐక్యతతో జీవించాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ కోలాప్రసాద్ తెలిపారు. పులివెందులలోని సీఎస్ఐ చర్చిలో అలియన్స్ ఫర్ ఫాస్టర్స్ డెవెలప్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ పి.మహేష్‌ను ఘనంగా సన్మానించారు. కోలాప్రసాద్ మాట్లాడుతూ కడప కృపా కాలనీకి చెందిన న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు, యునైటెడ్ ఫాస్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహేష్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. క్రైస్తవ ఫాస్టర్లందరూ ఐక్యత, ప్రేమతో మెలగాలని పిలుపునిచ్చారు. అనంతరం దైవ జనులు జేఎస్ రంజిత్, ప్రశాంత్, దేవరాజు మాట్లాడారు. ఈ సమావేశంలో థామస్, ఆనంద్, రవితేజ పాల్గొన్నారు.

మృతిపై విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్: ప్రొద్దుటూరు పట్టణంలోని సార్వకట్ట వీధిలో నివాసముండే మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి అతి దారుణంగా ప్రాణం తీసిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. విలేకరులతో కడపలో ఆయన మాట్లాడుతూ ప్రేమ పేరుతో అమ్మాయిలను శారీరక ఇబ్బందులకు గురి చేయడం, మాట వినకపోతే చంపడం ఈ సమాజంలో పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మహానాడు తోరణాలు పనికొస్తున్నాయిలా...!



మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అడ్డా అయిన కడపలో మహానాడు నిర్వహించామని టీడీపీ నేతలు గొప్పలు చెప్పుకున్నారు. ఆ మహానాడుతో జిల్లాకు గానీ, కడప నగరానికి గానీ ఒరిగింది శూన్యం. కానీ మహానాడుకు కట్టిన జెండాలు, తోరణాలను రైతులు ఇలా వరినారుకు రక్షణగా కట్టుకున్నారు. నగర శివారులోని రామచంద్రాపురంలో ఈ దృశ్యాలు కనిపించాయి.

– ఫోటోలు– సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దళితుల భూములను కబ్జా చేయకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.నారాయణ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ కడప జిల్లాలోని 36 మండలాలోల దళితుల భూముల కబ్జా, వివక్షత, గ్రామ బహిష్కరణ, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. వారికి మనో ధైర్యాన్ని కలిగించే సంఘీభావ పోరాటాలు సమాజంలో రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలో సామాజిక న్యాయ పోరాటాలు కులవక్షత వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ప్రారంభిస్తామన్నారు. అక్రమార్కుల దౌర్జన్యాన్ని ప్రోత్సహించి పాలక, ప్రతిపక్ష పార్టీలు అండగా నిలుస్తున్నాయని విమర్శించారు. కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండిజకరయ్య మాట్లాడుతూ కడప దళితులకు పట్టాలిస్తే, ధనిక పెత్తందారీ వర్గాలు నకిలీ రికార్డులు సృష్టించి, వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారన్నారు. దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.నారాయణ మాట్లాడుతూ మూలపల్లె గ్రామంలో దళితుల భూములు ఆక్రమించారని ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధితులపైనే బల ప్రయోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, కెవీపీఎస్ జిల్లా నాయకులు జితేంద్ర, దళిత నాయకులు జార్జి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మునెయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య, తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు.

రిమ్స్‌లో అన్నదానం



భోజన పొట్లాలు అందజేస్తున్న విద్యాసంస్థల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : కందుల విద్యాసంస్థల అధినేత కందుల చంద్రఓబుల్‌రెడ్డి ఆయన తండ్రి జ్ఞాపకార్థం మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కడప రిమ్స్ నందు సుదూర ప్రాంతాల నుంచి వైద్య సేవల కోసం వచ్చే వారికి ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రతి మంగళ, శుక్రవారాల్లో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భోజన పొట్లాలు పంపిణీ చేశారని తెలిపారు.

మైనర్ బాలిక హత్య కేసులో నిందితుడిని శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గండికోటలో ప్రొద్దుటూరుకు చెందిన మైనర్ బాలిక హత్య కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రేమ పేరుతో నిందితుడు వంచన చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, ఇలాంటి ఘోరమైన నేరాలకు పాల్పడే నిందితుల కేసులను త్వరితగతిన పూర్తిచేసి శిక్ష విధించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కృషిచేయాలన్నారు. మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవల మైనర్ బాలికలు, మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, ఘోరాలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. మహిళలపై నేరాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ వాలిడేషన్ సవరణ అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కడప సెవెన్ రోడ్స్ : పెన్షనర్ల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం దొంగచాటుగా పెన్షన్ వాలిడేషన్ సవరణ చేపట్టడం అన్యాయమని ప్రభుత్వ పెన్షనర్లు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(గుంటూరు) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది పెన్షనర్లు తరలివచ్చారు. జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చెన్నారెడ్డి, ఎస్.రామ్మూర్తినాయుడు, నూనె నగేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు పెన్షనర్ల ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారాయని విమర్శించారు. పెన్షనర్లను ఆదుకోవాల్సింది పోయి ఉన్న రాయితీలను ఊడగొట్టడం గర్హనీయమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దొంగచాటుగా పెన్షనర్ల ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడుతోందన్నారు. మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తినరసింహా రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ వాలిడేషన్ సవరణ చట్టాన్ని రాజ్యసభలో సులభంగా ఆమోదింపచేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు చేస్తోందని విమర్శించారు. పెన్షనర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, బాకీ పడిన మూడు విడతల డీఆర్ విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి వెంటనే తాత్కాలిక భృతి మంజూరుచేయాలని కోరారు. నోబెల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ పెన్షనర్ల పోరాటంలో తాము ముందు ఉంటామని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, రాయలసీమ రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్టాభిరామయ్య, పెన్షనర్ల సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు నాగమునిరెడ్డి, గౌరవాధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. బాల యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తత అవసరం



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న సీఐ జావిద్

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ బస్సు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని కడప ట్రాఫిక్ సీఐ జావిద్ తెలిపారు. కడప డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ జావిద్ మాట్లాడుతూ కొంతమంది డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులను తమ కుటుంబ సభ్యుల్లా.. చూసుకుంటూ డ్రైవింగ్ చేసినప్పుడే ప్రమాదాలు జరగవని తెలిపారు. డిప్యూటీ సీఎంఈ దిల్లీశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు ఇందన పొదుపు పాటించడంపై పంచ సూత్రాలను వివరించారు. అనంతరం డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బ్రహ్మ కుమారీస్ సంస్థ ఓంశాంతి ప్రదీపా అక్కయ్య మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఐ కృష్ణారెడ్డి, పులివెందుల ఎస్‌డీఐ బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాప్‌లో విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ వర్క్ షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ‘కెపాసిటీ బిల్డింగ్ నేషనల్ వర్క్ షాప్ లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు బి.ఖాదర్ బాషా, సగినాల అహమద్, గైడ్ కెప్టెన్ వి.చంద్రావతి పాల్గొన్నారు. నాయకత్వ లక్షణాలు తోపాటు అనేక సామాజిక హిత కార్యక్రమాల గురించి వీరు ప్రజెంటేషన్ చేశారు. క్యాంపును విజయవంతంగా పూర్తి చేసుకుని జిల్లాకు విచ్చేసిన వీరికి మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ కం సెక్రటరీ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ సర్టిఫికెట్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులలో మయోఫియా కంటి వ్యాధి



డాక్టర్ కావ్య మాధురి

కడప కోటిరెడ్డి సర్కిల్ : చిన్నారులలో మయోఫియా కంటి వ్యాధి పెరుగుతోందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌వీపీఈఐ వైద్యులు, మయోఫియా స్పెషలిస్ట్ డాక్టర్ కావ్యమాధురి బెజ్జంకి సూచించారు. కడపలోని డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి ప్రాంగణంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ మయోఫియా కంటి వ్యాధిపై పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా కావ్యమాధురి బెజ్జంకి మాట్లాడుతూ పిల్లలలో మయోఫియా 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మందికి మయోఫియా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆరు కంటే ఎక్కువ డయోప్టర్లున్న పిల్లల జీవితంలో అంధత్వ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. మయోఫియా వ్యాధి సోకిన వారంతా దగ్గర వస్తువు స్పష్టంగా చూడగలుగుతారని, దూరపు వస్తువులు అస్పష్టంగా కనిపిస్తాయన్నారు. కొంతమంది పిల్లలు బోర్డు మీద కనిపించే వాటిని చూసి రాసుకోలేక పక్కవారి నోట్స్ చూసి రాసుకుంటారన్నారు. కళ్లు తిరగడం, తరచుగా కళ్లు రుద్దడం, స్క్రీన్లు, పుస్తకాలు ముఖం దగ్గరగా పెట్టుకోవడం జరుగుతుందన్నారు. పిల్లలు చదవడం లేదా స్మార్ట్ ఫోన్లు చూస్తూ గంటల తరబడి ఉండడం చేయరాదని, బహిరంగ ప్రదేశాలలో ఆడుకునే విధంగా చూడాలన్నారు. ఎల్‌వీపీఈఐ హైదరాబాద్ భువనేశ్వర్, విశాఖపట్టణం, విజయవాడలోని తృతీయ కేంద్రాలలో ఇన్ఫర్ మయోఫికే కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలి

కడప అర్బన్: మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. దేశం కోసం మధ్యవర్తిత్వంపై ఈ నెల 10 నుంచి 16వరకు ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా న్యాయసేవా సదన్‌లో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, ప్రజలు పాల్గొన్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని తమ ఛాంబర్‌లో మంగళవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్, స్టాట్యూటరీ మీటింగ్ వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాన్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్ బాబాఫక్రుద్దీన్‌తోపాటు, అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ, జేసీ, ఏఎస్పీలు, కేంద్రకారాగారపు, ప్రత్యేక మహిళా కారాగార సూపరింటెండెంట్లు, కడప డిస్టిక్ సబ్ జైల్ ఆఫీసర్ గవర్నమెంట్ లీడర్, నామినేటెడ్ మెంబర్స్ పాల్గొన్నారు.

భూ సమస్యపై పోరాటాన్ని ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పాత కడప దళితుల భూమి సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కడప ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 29 రోజులుగా ఆర్డీవో కార్యాలయం నందు రిలే నిరాహార దీక్షలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేశారన్నారు. సమస్య పరిష్కరించకపోగా దీక్షలను భగ్నం చేసి టెంటు కూల్చివేశారన్నారు. తమకు ఇచ్చిన భూమిలో పేదలు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, ఇపుడు ఆక్రమణదారులు వాటిని స్వాధీనం చేసుకున్నారని అన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుండా భూమి కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న దళితుల దీక్షను భగ్నం చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. దళిత, గిరిజన గ్రామాలలో సదస్సులు, సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ నెల 19న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మడగలం ప్రసాద్, ఓబులేసు, దివాకర్, వీర సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు.. అట్టర్‌ప్లాఫ్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్ బూసిపాటి



విలేకరులతో మాట్లాడుతున్న బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం అట్టర్‌ప్లాఫ్ అయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్ బూసిపాటి విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారమే పరామావధిగా హామీలిచ్చి .. అమలు చేయలేక.. ఏమి చేశారో చెప్పుకోలేక కూటమి నేతలు తంటాలు పడుతున్నారని అన్నారు. చంద్రబాబు అలవిగాని హామీలతో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ ఢంకా భజాయించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భవిష్యత్తును అంధకారం చేశారన్నారు. ఈ ఏడాది అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు తప్ప కూటమి నాయకులు చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేశామని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పే ధైర్యం వారికి లేదన్నారు. తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అమలు చేసి ప్రజలకు ఏదో ఒరగబెట్టినట్లు సీఎం కుమారుడు లోకేష్, చెప్పుకోవడం ఆయన చేతగానితనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయవచ్చని చెప్పిన చంద్రబాబు, నేడు ఉచిత బస్సు జిల్లాకే పరిమితమనడం మహిళలను మోసంచేయడమేనన్నారు. ప్రభుత్వం నుంచి పీసమెత్తు సాయం అన్నదాతలకు అందకపోగా, రైతులను దండుపాళ్యం బ్యాచ్ అంటూ మాట్లాడడం కూటమి నేతలకే చెల్లిందని మండిపడ్డారు. హామీలు అమలు చేయలేదని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని, ఇప్పటికైన పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైసీపీ డాక్టర్స్ విభాగం ఇసీ సభ్యులు డాక్టర్ పెంచలయ్య, వైసీపీ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన వారికి అవకాశం కల్పించండి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 2, 3, 4 సెమిస్టర్ పరీక్షలలో పెయిల్ అయిన విద్యార్థులకు కనీసం ఒక సబ్జెక్టుకు అవకాశం కల్పించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ కోరారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యోగివేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ పుత్తా పద్మను ఈ విషయమై మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీ పరిధిలో చదువుతే పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మళ్లీ అవకాశం కల్పించేవారన్నారు. ప్రస్తుతం అధికారులు ఆ అవకాశం లేకుండా చూసి విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారన్నారు. సెమిస్టరీ పరీక్షలకు అవకాశం కల్పిస్తే ఉన్నత విద్యకు పోయే అవకాశముంటుందని వారు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు కనీసం ఒక్కొక్క సెమ్ నుండి ఒక్కొక్క సబ్జెక్టుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, తదితరులు పాల్గొన్నారు